ఆరోగ్య వ్యవస్థ మెరుగుదలకు దార్శనిక నాయకత్వం అవసరం: గవర్నర్ జిష్ణుదేవ్



డాక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డును అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బంజారాహిల్స్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ఆరోగ్య వ్యవస్థ మరింత మెరుగుపడాలంటే దార్శనిక నాయకత్వం కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ప్రొవైడర్ ఇండియా(ఏహెచ్‌పీఐ) ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో 'హైటెక్ హెల్త్‌కేర్ యుగంలో నాయకత్వం' అనే అంశంపై నిర్వహిస్తున్న సదస్సు రెండోరోజైన శనివారంతో ముగిసింది. చివరి రోజున ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నాకు 'విజనరీ హెల్త్‌కేర్ సీఈఓ' అవార్డు అందజేశారు. ఆరోగ్య సంరక్షణలో సేవా భావం ముఖ్యమని ఈ రంగాన్ని ఎప్పుడు కూడా వ్యాపార ధోరణితో చూడవద్దన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌పీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అలెగ్జాండర్‌థామస్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఐ. సహదుల్లా, హెల్త్ పాలసీ కమిటీ చైర్మన్ విశాల్ బాలి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ గిర్ధర్ జె. గ్యాని తదితరులు పాల్గొన్నారు.

భారీగా అక్రమ మద్యం పట్టివేత

● 585 మందు బాటిళ్లు స్వాధీనం.. విలువ రూ. 21.80 లక్షలు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదారాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌పీడీ) కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు వివిధ ప్రాంతాల్లో శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. ఇందులో రూ. 21.80లక్షల విలువైన 585 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నాయి. పహాడీషరీఫ్ పరిధిలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్‌తో పాటుసీఐలు సుభాష్ చందర్, బాలరాజులు, ఎస్సైై ప్రత్యేక టీమ్‌గా రంగంలోకి దిగి వాహనాల తనిఖీలు చేసి గోవా, ఢిల్లీ, హర్యానా నుంచి విచ్చలవిడిగా సరఫరా అవుతున్న 449 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకన్నాయి. వీటి విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. ధూల్‌పేట్‌లో హైదరాబాద్ డీటీఎఫ్ సీఐ శిరిష, ధూల్‌పేట్ సీఐ గోపాల్ సిబ్బంది కలిసి 72 మద్యం బాటిళ్లను ఒక ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. తన సిబ్బందితో కలిసి సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య టీమ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో 47 మద్యం బాటిళ్లను, నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై చంద్రాకాంత్ సిబ్బంది పిస్తా హౌస్ ప్రాంతంలో 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. మొత్తం 136 బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. వీటి విలువ రూ. 6.80 లక్షలుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

నేటి నుంచి రాజీవ్ గాంధీ చాలెంజర్స్ సిరీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాజీవ్ గాంధీ చాలెంజర్ సిరీస్ ఉప్పల్ స్టేడియంలో సోమవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నామని, ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా క్రీడా మంత్రి వాకిటి శ్రీహరిని డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (డీఏసీఏహెచ్) ఆహ్వానించింది. సచివాలయంలో శ్రీహరిని డీఏసీఏహెచ్ అధ్యక్షుడు సురేందర్ అగర్వాల్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

శేషుబాబు, శిరీష స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గాయని మర్సుకోల కళావతికి తోట శేషుబాబు, యువ కవి సల్వాది గోవర్దన్‌కు దాసరి శిరీష పురస్కారాలను నిర్వాహకురాలు అపర్ణ తోట ప్రదానం చేశారు. శనివారం బంజారాహిల్స్ లామాకాన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రచయిత్రి అపర్ణ తోట యేటా తన తల్లిదండ్రులు దాసరి శిరీష, తోట శేషుబాబు స్మారకంగా ప్రత్యామ్నాయ కళా, సాహిత్య రంగాలలో పని చేస్తున్న వారిని గుర్తించి పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని సాహిత్య విమర్శకుడు ఏకే ప్రభాకర్ అన్నారు. సల్వాది గోవర్దన్ రాసిన "మా అమ్మ కట్టెలకి పోయింది - నేనైతే గుడ్డోన్ని" కవితా సంపుటిని సినీ రచయిత్రి పింగళి చైతన్య పరిచయం చేశారు.

మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిది

మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

ముషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలన బాధ్యత అందరిదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం మగ్దూమ్ భవన్.. రాజ్ బహదూర్ గౌర్ హాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్య మండలి నిర్వహిస్తున్న మాదకద్రవ్యాలతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించే కళారూపాల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రజానాట్య మండలి నాటక బృందం మాదకద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ తదితరులు పాల్గొన్నారు

నాటకీయతకు ఆధునిక రూపం.. చంద్రశేఖర్ కథలు

సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్



మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రచయిత చంద్రశేఖర్ కథలు నాటకీయతను ఆధునిక రూపంలో పరిచయం చేశాయని సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. నాటక రంగానికి చెందిన రచయితగా పేరు సంపాదించి విభిన్న రూపంలోని కథలను పొందుపరిచారన్నారు. శనివారంరాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండ్ల చంద్రశేఖర్ రచించిన మ్యాజిక్ ఇఫ్ కథల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చంద్రశేఖర్ భిన్నమైన కథలను సేకరించారని అన్నారు. చంద్రశేఖర్ రచించిన మరో కథల పుస్తకం బొర చెక్కు పుస్తకాన్ని కవి సిద్ధార్థ ఆవిష్కరించి మాట్లాడారు. కథలు ఎంత బాగా చదివితే కవిత్వం అంతా బాగా ఉంటుందన్నారు. ఆవిష్కరణ సభకు ప్రముఖ రచయిత కోయి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాంచంద్రరెడ్డి,ఆదిత్య కొర్రపాటి, కథల పుస్తకాల రచయిత ఇండ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నియామకంపై రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ నియామకంపై కోర్టుల స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం.. రాజ్యాంగపరమైన అవకతవక అని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది. సుప్రీం కోర్టు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన, బైండింగ్ ఆదేశాలున్నప్పటికీ ఇప్పటివరకు నియామక ప్రక్రియపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొంది. ఇది కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడం "న్యాయవ్యవస్థ అధికారం, న్యాయపాలనపై దెబ్బ" అని సోషల్ జస్టిస్ డైరెక్టర్, జాతీయ అధ్యక్షుడు హిదాయత్ అలీ మిర్జా, డైరెక్టర్, చైర్మన్ షబ్బీర్ అలీ మీర్జాలు తెలిపారు.

ఒక్కరోజు శిక్షణ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీ, ప్రొఫెషనల్ మెలకువలపై 20 మంది ఉద్యోగార్థులకు జీహెచ్‌ఎంసీలో శనివారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. క్వియర్ బంధు అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ (1ఎం1బీ) సహకారంతో వివిధ నైపుణ్యానికి సంబంధించిన అంశాల గురించి తెలిపారు. శిక్షణ పొందిన 20 మందిలో ఆరుగురికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందించారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ (హెల్త్, ఎస్‌యూహెచ్‌ఎం) పంకజా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లో బతుకమ్మ వేడుకల్లో టీచర్లు, పేరెంట్స్



విద్యానగర్‌లోని ఎస్‌పీఎస్ ప్రభుత్వ పాఠశాలలో వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

తొమ్మిది రోజులు బతుకమ్మల సందడి

ఆటపాటల్లో అంబర్‌పేట బస్తీలు.. ఈ నెల 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు



నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో వేడుకల్లో టీచర్లు, విద్యార్థినులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచులు బతుకమ్మ ఆడితే ప్రకృతి పులకరిస్తుంది. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన బతుకమ్మ వస్తుందంటే తెలంగాణ ఆడపడుచుల ఆనందానికి అవధులు ఉండవు. ఒక్కొక్క పండక్కు ఒక్కొక్క ప్రత్యేక చరిత్ర ఉంటుంది. కాని బతుకమ్మ పండుగ మాత్రం పర్యావరణంతో ముడిపడి ఉండడం గమనార్హం. రంగురంగుల పూలతో సుందరంగా అలంకరించిన బతుకమ్మను తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు ఆనందంగా ఆడుకుంటారు. ఈ నెల 21న ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభమై ఈనెల 30న సద్దుల బతుకమ్మతో ముగియనుంది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని దుర్గాష్టమి వరకు ఈ బతుకమ్మ ఆటలను ఆడుకోవడం ఆనవాయితీ. అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని 5మున్సిపల్ డివిజన్లలో బతుకమ్మ వేడుకలు సందడి చేయనున్నాయి. అంబర్‌పేట, కాచిగూడ, గోల్నాక, నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట డివిజన్లలో అన్నిబస్తీలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడానికి మహిళలు, యువతులు సన్నద్ధమవుతున్నారు. ప్రైవేటు కళాశాలలు కూడా బతుకమ్మ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

26న బతుకమ్మకుంటలో వేడుకలు

బాగ్ అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంటలో ఈనెల 26న బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. బతుకమ్మకుంటను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన అనంతరం బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు సారథ్యంలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ నేతలు అన్ని డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సారథ్యంలో ఈనెల 29న అంబర్‌పేట మునిసిపల్ గ్రౌండ్‌లో బతుకమ్మ వేడుకలు జరగనున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో సంబరాలు

ముషీరాబాద్, రాంనగర్, (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాటలు పాడుతూ వేడుకను జరుపుకున్నారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐఓఎస్, ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం స్వరూపారాణి ఆధ్వర్యంలో, విద్యానగర్‌లోని ఎస్‌పీఎస్ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బతుకమ్మ ఆడి సందడి చేశారు. నల్లకుంట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో, విద్యానగర్‌లోని ఎస్‌పీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం : సీఐటీయూ



ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో నిరసన తెలియజేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని వారిని కదిలించేందుకు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ఐక్యంగా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ పబ్లిక్, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలో మోదీ నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకువచ్చి కార్మికవర్గాల మెడకు ఉరితాడు బిగించాడని, మోటార్ వాహనాల చట్టం 2019లో అగ్రిగేటర్స్‌కు ప్రవేశం కల్పించారని, సింగిల్ ఓనర్ కమ్ డ్రైవర్స్ లేకుండా డ్రైవర్లందరూ ఆన్‌లైన్‌లోకి తప్పనిసరిగా చేరేవిధంగా పరిస్థితులు సృష్టిస్తున్నారన్నారు. దీనివల్ల రాబోయే కాలంలో సింగిల్ ఓనర్ కమ్ డ్రైవర్స్ కనబడకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ వైఖరిపై ట్రాన్స్‌పోర్ట్ రంగంలోని కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించి పరిస్థితులు మనకు అనుకూలంగా మారేవరకూ పోరాటం చేయాలన్నారు. అంతకుముందు బాగ్‌లింగంపల్లినుంచి క్రాస్ రోడ్‌కు ర్యాలీగా చేరుకుని సభ నిర్వహించి నిరసన తెలిపి ప్రసంగించారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో బీసీ,ఎస్సీలకు అన్యాయం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి

రాంనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. ఈమేరకు శనివారం బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 550ను అధికారులు సక్రమంగా అమలు చేయడంలేదన్నారు. దీంతో బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఏటా 200 నుంచి 300 వరకు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లను కోల్పోతున్నారన్నారు. మెరిట్ వచ్చి ఓపెన్ కాంపిటీషన్‌లో వచ్చిన అభ్యర్థులను రిజర్వేషన్లలో చేర్చి ఆ వర్గాలకు రావాల్సిన కోటాను తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. 2021 నుంచి ఆ జీవో ప్రక్రియను పక్కనపెట్టి కొత్త జీవో 144 తెచ్చి కాలేజీ ఆప్షన్ పేరు మీద బీసీ, ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం జీవో 550 అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, మణికంఠ, అనంతయ్య, రవికుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాలకృష్ణారెడ్డి, మాజీమంత్రి శ్రీనివాసరావు

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థి అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకుని పోటీ పరీక్షలలో రాణించాలని కోరారు. శనివారం అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఉమాంగ్ 2కే 25 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్ని ఇప్పుడు భారత్‌వైపు చూస్తున్నాయని అన్ని రంగాలలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీమంత్రి ముత్యంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని కోరారు. ఎఫ్‌టీ సీసీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు గరిమెళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ దేశభక్తి చాలా ముఖ్యమన్నారు. సీనియర్ పాత్రికేయులు రాజశేఖర్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలకపాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ సీనియర్ మేనేజర్ జి.నిర్మల్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రాకేష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, హెచ్‌ఆర్ డైరెక్టర్ వై.జయప్రద, ఉపాధ్యక్షుడు ఎం.వి.ఎస్.ఎస్.నందీష్ తదితరులు పాల్గొన్నారు.





సురేందర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి

బీజేపీ నేత కుటుంబసభ్యులకు పరామర్శ

చిక్కడపల్లి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాంధీనగర్ డివిజన్ బీజేపీ సీనియర్ నేత ఆకుల సురేందర్ కుటుంబసభ్యులను వారి నివాసంలో శనివారం హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించి సురేందర్‌కు నివాళులర్పించారు. ఆయన భార్యజ్యోతి, కుమారుడు అభిషేక్,సోదరుడు శ్రీనివాస్‌లకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నల్లకుంటలో చెత్తను ఎత్తివేస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంటను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతాం

నల్లకుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నల్లకుంటను ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమని కార్పొరేటర్ యాకర.అమృత అన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలు, అంతర్గత రోడ్లు, ప్రధాన రోడ్లపై చెత్త, చెదారం, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు ఎత్తివేసి తరలించడంపై అంబర్‌పేట నియోజకవర్గం సర్కిల్ డీఎంసీ, ఏఎంహెచ్‌వోలతో చర్చించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శనివారం డివిజన్‌లోని పాత రామాలయం వీధి, దుర్గామాత దేవాలయం వీధి తదితర ప్రాంతాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆ ప్రాంతాలలో చెత్త, మట్టికుప్పలను ఎత్తివేసి రిక్షాలో తరలించారు.

దివ్యాంగుల, వృద్ధుల పింఛన్లు పెంచాలి

కవాడిగూడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేల వరకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్‌ను రూ.2వేలనుంచి రూ.4 వేలకు పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంఆర్‌పీఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు బొట్టు మహేష్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ, వీహెచ్‌పీఎస్ సీనియర్ నాయకులు అన్నారు. శనివారం కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీకి వారు వినతి పత్రం అందజేశారు.

కలుషిత నీటిని నివారించాలి : కార్పొరేటర్

ముషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని పలు ప్రాంతాలలో డ్రైనేజీ పైప్‌లైన్ మురుగునీరు మంచినీటి సరఫరా లో కలవడం వల్ల కలుషిత నీటి సరఫరా జరుగుతున్నదని వెంటనే కలుషిత నీటిని నివారించి ప్రజలకు మెరుగైన మంచినీటిని అందించాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ కోరారు. శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కార్పొరేటర్ కలిసి వినతి పత్రం అందజేశారు.

ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలి : ఉమాదేవి

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడ డివిజన్‌లో మురికిచెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. మురికిచెత్త పేరుకుపోవడం వల్ల దుర్గంధం వ్యాపించి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శనివారం కాచిగూడ స్టేషన్ మెయిన్ రోడ్‌లోని త్రివేణి హోటల్ చౌరస్తా తదితర ప్రాంతాలలో ఆమె పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పేరుకుపోయిన మురికిచెత్తపై ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

రైలు నుంచి జారిపడి రైతు మృతి

బర్కత్‌పురా, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నడుస్తున్న రైలు దిగబోతు ప్రమాదవశాత్తు జారిపడి ఓ రైతు మృతి చెందాడు కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన చిన్ని కృష్ణ కుమారుడు కూర్మ మల్లయ్య(50) వృత్తి రీత్యా రైతు. ఉందానగర్‌లో నివాసముంటున్న తన కుమార్తెను చూడటానికి కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైల్లో నగరానికి వచ్చాడు. శనివారం రాత్రి రైలు ఉందానగర్ రైల్వే స్టేషన్ వద్ద వేగం తగ్గడంతో మల్లయ్య రైలు దిగడానికి ప్రయత్నించి.. ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

చెట్ల కొమ్మలు నరుకుతుండగా ప్రమాదం

భారీ చెట్టు కొమ్మ మీద పడి వ్యక్తికి భారీ గాయాలు

ముషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో చెట్లకొమ్మలు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తగులుతుండడంతో శనివారం ఉద్యానవన శాఖ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెట్ల కొమ్మలు తొలగించారు. ఈ క్రమంలో పీ అండ్ టీ కాలనీకి చెందిన కాలనీ కార్యదర్శి డి.రామకృష్ణ (65) అటుగా వెళ్తుండగా ప్రమాదవశాత్తు సిబ్బంది నరుకుతున్న భారీ చెట్టుకొమ్మ రామకృష్ణపై పడడంతో కుప్పకూలాడు. రెండు కాళ్లపై భారీ చెట్టుకొమ్మ పడడం వల్ల రెండు కాళ్లు విరగడంతోపాటు బలమైన దెబ్బలు తగిలాయి. స్థానికులు వెంటనే చెట్టుకొమ్మను ఆయన పైనుంచి తొలగించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. బలమైన గాయాలుకావడం వల్ల రామకృష్ణను ఐసీయూలో ఉంచి వైద్యపరీక్షలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, పీఅండ్‌టీ కాలనీ అధ్యక్షురాలు లత ఆసుపత్రికి వెళ్లి రామకృష్ణకు ధైర్యం చెప్పారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న మహేష్ అగర్వాల్

ధర్మపురిలో గోశాల ఏర్పాటుకు స్థలం కేటాయిస్తాం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బర్కత్‌పుర, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురిలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పరిధిలో గోశాల ఏర్పాటుకు స్థలం కేటాయించే విధం గా తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శనివారం మంత్రిని కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. దసరా తర్వాత స్థల పరిశీలన చేపడతామని, స్థల పరిశీలన సమయంలో గోశాల ఫెడరేషన్ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానిస్తామని మంత్రి హామీ ఇచ్చారని అగర్వాల్ తెలిపారు.

'వరల్డ్ టీచర్స్' ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

రాంనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ టీచర్స్ డే అక్టోబరు 5 పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ అవార్డు 2025 ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ఈఎస్ఎస్.నారాయణ మాస్టర్ తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులను విద్య, విజ్ఞాన, బోధనతోపాటు సాహిత్య, క్రీడా రంగాలలో అత్యుత్తమ క్రమశిక్షణతో తీర్చిదిద్దుతున్న టీచర్లు ఈ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 30లోపు ఆల్ ది బెస్ట్ అకాడమిలో నేరుగా లేదా 9652347207 ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

'అమ్మాయిలూ.. చదువే అన్నిటికీ మూలం '



బాలిక సాధికారత బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తెలంగాణ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, డీసీపీ డాక్టర్ లావణ్య తదితరులు

రాంనగర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అమ్మాయిలు తమ కాళ్లపై తాము నిలబడి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవాలంటే దానికి ప్రధాన ఆయుధం చదువేనని తెలంగాణ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బాలిక సాధికారత బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. అమ్మాయిలు తమ హక్కులను చట్టాలను ఉపయోగించుకుని ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలన్నారు. రాజకీయాలలో; శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం, కళల్లో, సామాజిక సేవలో నిష్ణాతులైన మహిళలు ఉన్నారన్నారు. సావిత్రీబాయి పూలే మహిళలకు చదువే ప్రధాన ఆయుధమని నొక్కి చెప్పారని సూచించారు. కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ వంటి వారిని ఆసరాగా చేసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ విభాగం డీసీపీ లావణ్య, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేష్, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.